

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 09-04-2026 సంపుటి : 07 సంచిక 310 పేజీలు : 8 వెల : రూ 3-00


# రహదారుల నిర్వహణ పటిష్ఠంగా ఉండాలి: సీఎం చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 8 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రహదారులు, భవనాలు, రవాణాశాఖపై సచివాలయంలోసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు, అధికారులతో సీఎం చర్చించారు. ప్రధానంగా రాష్ట్రంలో రహదారుల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఈ సమీక్షకు మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.రాష్ట్రంలో ఉన్న 45 వేల కిలోమీటర్ల పైచిలుకు రహదారుల నిర్వహణ పటిష్ఠంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలని సూచించారు. మెరుగైన రహదారుల ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. అతి తక్కువ వ్యయానికే ప్రజా రవాణా జరిగేలా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# అభ్యంతరకర వ్యాఖ్యలను హర్షించే రోజులకు కాలం చెల్లింది: జనసేన

అమరావతి, ఏప్రిల్ 8 : ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుట వైసీపీ ఆందోళనలు చేయడంపై జనసేన (ఏజీనిజీ ావనిజీ) అగ్రనేతలు స్పందించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నేతలు దాడికి యత్నించిన ఘటనను ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారని అన్నారు. ఈ అంశంపై పార్టీ ముఖ్యులతో బుధవారం ఉదయం చర్చించారని తెలిపారు. ఏబీఎన్ ఛానెల్‌లో ప్రసారమైన వీకెండ్ కామెంట్‌లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని చెప్పారు. 'జెన్ ? జీ'ని తక్కువ అంచనా వేయొద్దని పవన్ కల్యాణ్ పలు సందర్భాల్లో జెన్ ? జీ గురించి ప్రస్తావిస్తారని అన్నారు. జెన్ జీ తరం వారి ఆలోచనలను, వారి నిశిత పరిశీలనను ప్రజా జీవితంలో ఉన్నవారు తక్కువ అంచనా వేయకూడదని పవన్ కల్యాణ్ స్పష్టంగా చెప్పారని అన్నారు.ప్రజా ప్రతినిధులు, నాయకులు, సెలబ్రిటీస్ నడవడికను, వారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను జెన్ ? జీ పరిశీలిస్తుందని అన్నారు. 90వ దశకం రాజకీయాలు, హద్దులు దాటే మాటలు, అభ్యంతరకర వ్యాఖ్యలను హర్షించే రోజులకు కాలం చెల్లిందనే వాస్తవాన్ని ప్రజా క్షేత్రంలో ఉన్న ప్రతి ఒక్కరూ, విశ్లేషకులు పరిగణనలోకి తీసుకోవాలని పవన్ కల్యాణ్ బలంగా చెబుతున్నారని ప్రస్తావించారు. జనసేన నాయకులకు, వీర మహిళలకు, శ్రేణులకు కూడా ఈ విషయాన్ని ప్రస్ఫుటంగా తెలియజేయాలని పార్టీ ముఖ్యులను పవన్ కల్యాణ్ ఆదేశించారని జనసేన అగ్రనేతలు పేర్కొన్నారు.




# యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి-మంత్రి సవిత



మంగళగిరి,యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి, మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియ జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. నాగార్జున యూనివర్శిటీలోని డాక్టర్ హెచ్.హెచ్.డైక్ మన్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవకాశాలపై ఒకరోజు అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి, అనంతరం మంత్రి సవిత ప్రసంగించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు ఏర్పాటుపై అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు మేలు కలుగజేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇంతకుముందు ప్రకృతి వ్యవసాయంతో ఎలా లాభాలు ఆర్జించ వచ్చో అవగాహన సదస్సు నిర్వహించారన్నారు. ఇప్పుడు ఉపాధి కల్పనపై మరో అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయుల పేదరికాన్ని పారదోలడానికి కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. దేశ పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రగామిగా నిలబెట్టడానికి సీఏ చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 22 నెలల కాలంలోనే ఏపీకి రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే పెట్టుబడి దారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తోందన్నారు. తక్షణ అనుమతులకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా అండగా నిలుస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువత డీపీఆర్ లతో ముందుకొస్తే, చిన్న,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు, ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తామని మంత్రి సవిత తెలిపారు.ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఒక రోజు సదస్సును ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన యువత, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతే భారత దేశ బలమని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. అందుకే సీఎం చంద్రబాబు అన్నింటా యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ల కంటే పారిశ్రామికవేత్తలుగా తోటి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. పారిశ్రామిక వేత్తలు గా మహిళలు రాణిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర ఈడబ్ల్యూఎస్ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ, అగ్ర కులాల్లో పేదరికంతో బాధపడే వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సీఈవో ఎం.విశ్వ, వీసీ గంగాధర్ రావు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు బుచ్చి రాంప్రసాద్, బ్రహ్మం చౌదరి, డైరెక్టర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్‌లో న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,534 కోట్లు.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది.కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది.రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

# కష్టపడిన వారిని గుర్తించడమే టీడీపీ సిద్ధాంతం: మంత్రి లోకేశ్..

అమరావతి: తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు. 'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వారితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉ ంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.






# సంపాదకీయం

గురువారం 09-04-2026

## హస్తినకు దీదీ...

ఈ దేశంలో మహిళా ప్రధానమంత్రిగా ఏకైక నాయకురాలు శ్ ఇందిరా గాంధీ ఉండేవారు. ఆమె ఐరన్ లేడీగా బలమైన ముద్ర వేసుకున్నారు. పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ మరోసారి అధికారంలోకి తీసుకురావాలని మమతా బెనర్జీ కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరుగుతున్నారు. ఆమెను ఎలాగైనా అధికారంలో నుంచి దించి కాషాయపు జెండా ఎగరేయాలని బీజేపీ ప్రతి వ్యూహాలతో ప్రయత్నాలు చేస్తోంది1966 నుంచి 1977 దాకా ఏకంగా 11 ఏళ్ళ పాటు కంటిన్యూస్ గా దేశాన్ని పాలించిన ఇందిర బలమైన నాయకురాలిగా జాతీయంగా అంతర్జాతీయంగా ఎదిగారు. ఇక 1980 నుంచి 1984లో మరణించేంతవరకు మరో అయిదేళ్ల పాటు ప్రధానిగా పాలించారు. మొత్తంగా 16 ఏళ్ల పాటు దేశాన్ని ఇందిరాగాంధీ ఏలారు. ఆమె తరువాత మరో మహిళ ఈ దేశంలో ప్రధాని పీఠం ఎక్కలేదు. అయితే ఇపుడు ఒక మహిళా నేత పేరు ఈ పదవి కోసం గట్టిగా వినిపిస్తోంది. ఆమె ఎవరో కాదు బెంగాల్ ప్రజల చేత దీదీ అని పిలిపించుకుని ముమ్మారు పశ్చిన బెంగాల్ కి ముఖ్యమంత్రిగా పనిచేసి వరుసగా నాలుగవ సారి గెలిచి రికార్డు బద్ధలు కొట్టాలని చూస్తున్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ. బెంగాల్ లో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత అభిషేక్ బెనర్జీ ఒక సభలో మాట్లాడుతూ పాకిస్తాన్ ని ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేశారు. కోల్ కటా మీదకు వస్తామని ఇళ్లలో దాడి చేస్తామని పాక్ పాలకులు అంటున్నారని కానీ తామే పాకిస్తాన్ మీదకు వెళ్ళి వారి సంగతి తేలుస్తామని వార్నింగ్ ఇచ్చారు. మమతా బెనర్జీ ఇండియా కూటమి తరఫున కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత ఇది తప్పకుండా జరుగుతుందని ఆయన స్పష్టంగా చెప్పారు. దీనిని బట్టి చూసిన వారు మమత ఇండియా కూటమి తరఫున ప్రధాని అభ్యర్థిగా ముందుకు వస్తున్నారా అన్న చర్చిస్తున్నారు.మూడు సార్లు బెంగాల్ సీఎం గా ఉన్న మమత 2026 ఎన్నికల్లో కనుక గెలిస్తే 2029 నాటికి ఆమె జాతీయ రాజకీయాల్లోకి వస్తారు అన్న చర్చ సాగుతోంది. మమత చూపు అపుడు ఢిల్లీ మీదనే ఉంటుందని అంటున్నారు. ఆ మాటకు వస్తే చాలా కాలంగా మమత జాతీయ రాజకీయల మీద ఆసక్తిగా ఉన్నారని అంటున్నారు. ఇక ఇండియా కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీగా ఉంది. ఆ తరువాత తృణమూల్ కాంగ్రెస్ ఉంటుంది. అందులో మరో బలమైన పార్టీగా డీఎంకే ఉన్నా కూడా సీనియారిటీ అనుభవం అన్నీ కలసి మమత ఇండియా కూటమి నాయకత్వాన్ని కోరుకుంటారు అని అంటున్నారు. బెంగాల్ లో విజయం తరువాత ఆమె ఇండియా కూటమి బాధ్యతలు తీసుకుని మోడీ సర్కార్ మీద గట్టిగా పోరాడుతారు అని అంటున్న ఇక మహిళా రిజర్వేషన్ అన్నది 2029 ఎన్నికల్లో గెలిచేందుకు తమ పార్టీకి ట్రంప్ కార్డు అవుతుందని బీజేపీ భావిస్తోంది కానీ అదే సమయంలో దేశంలో లోక్ సభ సీట్లు 840 దాకా పెరిగితే మాత్రం అందులో మూడవ వంతు మహిళా ఎంపీలే ఉంటారు అన్నది మరచిపోరారు. అలా లెక్క తీస్తే 280 దాకా ఎంపీ సీట్లు మహిళలకు దఖలు పడతాయి. దాంతో మహిళలు కూడా ప్రధాని పీఠం మీద గురి పెట్టేందుకు అవకాశాలు అధికం అవుతాయని అంటున్నారు. ఇక ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నా కూడా లీడ్ తీసుకుని బీజేపీ మీద పోరాటానికి మమత సిద్ధం అవుతారు అని అంటున్నారు. ఇండియా కూటమి నుంచి రేసులో : ఆ విధంగా డైనమిక్ లీడర్ షిప్ ని ఆమె ఇస్తారని తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు అంటున్నారు. 292 సీట్లు ఉన్న పశ్చిమబెంగాల్‌లో మాట్రిజ్ ఓ సర్వే నిర్వహించింది. ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ పోటీ అంచనాలు అందనంతగా ఉంది. తాజా సర్వేలో పార్టీలే షేక్ అయ్యే అభిప్రాయాలు ప్రజలు చెప్పారు. ఈ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ 43 శాతం ఓట్లతో 140 నుంచి 160 సీట్లను గెలుచుకోగలదు. ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీ 41 శాతం ఓట్లతో 130 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుంది. రాష్ట్రంలోని ఇతర పార్టీలు 16 శాతం ఓట్లతో 8 నుంచి 16 సీట్లు గెలుచుకోగలవు. పశ్చిమ బెంగాల్‌లో 148 సీట్లు గెలుచుకున్న పార్టీ అధికారంలోకి వస్తుంది. ఈ అభిప్రాయ సేకరణలో టీఎంసీకి 2 శాతం స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ ఈ తేడా చాలా తక్కువగా ఉండటంతో ఎన్నికల చిత్రం ఏ క్షణంలోనైనా మారిపోవచ్చు. మమత తరువాత కీలక హోదాలో పార్టీలో ఉన్న అభిషేక్ బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేశారు అంటే మమత కచ్చితంగా కాబోయే ప్రధానిగా ఇండియా కూటమి నుంచి రేసులో ఉంటారు అన్నది స్పష్టం అవుతోంది. ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు ఉంటే ఇండియా కూటమి సారధ్యం ఆమెకు దక్కడం కూడా కష్టమేమీ కాదు, మొత్తానికి ఇవన్నీ ఆలోచించే అభిషేక్ బెనర్జీ ఈ కామెంట్స్ చేసి ఉంటారని అంటున్నారు.

## హార్ముజ్ జలసంధి వద్ద టోల్ వసూలు..

### యుద్ధంతో నష్టపోయిన వేళ ఇరాన్ కీలక నిర్ణయం

న్యూ ఢిల్లీ, ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. ఇదే సమయంలో హార్ముజ్ జలసంధి కూడా అందుబాటులోకి రానుంది. దీంతో ఇకపై ఈ మార్గం గుండా అంతర్జాతీయ వాణిజ్య నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తాయి. కానీ, ఇక్కడే ఇరాన్ మెలికపెట్టబోతుంది. ఇకపై హార్ముజ్ జలసంధి నుంచి వెళ్లే నౌకలపై పన్నులు విధించే ఆలోచన చేస్తోంది ఇరాన్. ఇప్పటికే ఈ అంశంపై ఇరాన్ పార్లమెంట్‌లో చర్చ జరిగింది.



దీనికి అవసరమైన బిల్లును కూడా ఆమోదించింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించే పనిలో ఉంది. దీనిపై ఐఆర్‌జీసీ నిర్ణయం తీసుకుంటుంది. ఇది అమలులోకి వస్తే హార్ముజ్ జలసంధి నుంచి వెళ్లే నౌకలు ఇకపై ఇరాన్ నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో 20 శాతం ఈ జలసంధి నుంచే వెళ్లాలి. ప్రపంచంలో వాణిజ్యపరంగా ఇది అత్యంత కీలకమైన, రద్దీ అయిన జలమార్గం. ఇరాన్ ఈ ఫీజును సెక్యూరిటీ రిలేటెడ్ ఫీగా వసూలు చేయబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో భద్రత కోసం అవసరమైన నిర్వహణ ఛార్జీలను నౌకల నుంచి వసూలు చేయబోతుంది. ఇది ఇరాన్‌కు మంచి ఆదాయ వనరుగా మారనుంది. అయితే, ఈ నిర్ణయంపై వాణిజ్య నౌకలు, రవాణా, చమురు సంబంధిత వర్గాలు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల నౌకలపై, చమురు సంస్థలపై, అనేక దేశాలపై అదనపు భారం పడుతుంది.సరుకు రవాణా, ఇన్స్యూరెన్స్ ఛార్జీలు కూడా పెరుగుతాయి. ఇప్పటికే ఈ మార్గంలో వెళ్లే నౌకలపై ఇన్స్యూరెన్స్ ఇచ్చే కంపెనీలు ప్రీమియం పెంచబోతున్నట్లు ప్రకటించాయి. ముఖ్యంగా నౌకల రవాణాపై ఇరాన్ దళాలు ఆధిపత్యం చెలాయిస్తే మరింత ఇబ్బంది తప్పదు. ఇక, అంతర్జాతీయంగా చమురు ధరలు కూడా పెరుగుతాయి. అమెరికాతో యుద్ధం ద్వారా కలిగిన ఆర్థిక నష్టాన్ని ఇరాన్.. హార్ముజ్ వద్ద పన్నుల రూపంలో భర్తీ చేయనుంది. ఈ నిర్ణయం త్వరలోనే అమలులోకి వచ్చే అవకాశం ఉంది.

## మతం.. మూఢనమ్మకం.. క్షుద్రం.. సుప్రీంకోర్టులో ఆసక్తికర వాదనలు



న్యూఢిల్లీ: మతాల్లో ఉన్న మూఢవిశ్వాలను ఎత్తి చూపే హక్కు తమకు ఉందని సుప్రీంకోర్టు పేర్కొన్నది. మతవిశ్వాసాలపై న్యాయం వెల్లడించే హక్కు కూడా తమకు ఉన్నట్లు కోర్టు చెప్పింది. శబరిమలఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఆంక్షల కేసులో సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇవాళ రెండో రోజు కోర్టులో పలు కోణాల్లో ఆసక్తికర వాదనలు జరిగాయి. కేంద్రం చేసిన వాదనను సుప్రీం తిరస్కరించింది. జడ్జీలు న్యాయ రంగంలో మాత్రమే నిపుణులని, మతం అంశాల్లో కాదు అని, సాంప్రదాయాలపై సెక్యులర్ కోర్టు తన నిర్ణయాన్ని వెల్లడించడం సరికాదు అని కేంద్రం పేర్కొన్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల ధర్మాసనం ఈ కేసులో వాదనలు వింటోంది.విభిన్న మతస్తులు, వారి విశ్వాసాలపై కోర్టు విస్తృతంగా చర్చించింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. మతంలోని మూఢవిశ్వాసాలపై కోర్టు ఎలా నిర్ణయాన్ని వెల్లడిస్తుందని ప్రశ్నించారు. మూఢ నమ్మక విధానమే ఉన్నా.. ఆ అంశాన్ని కోర్టు తేల్చలేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(2)(బీ) ప్రకారం ఆ పని చట్టసభ్యులు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఫలానా విధానం మూఢనమ్మకమైందని, దీనిలో చట్టసభ ద్వారా సంస్కరణలు చేపట్టవచ్చు అన్నారు. క్షుద్ర విద్యతో పాటు ఇతర విధానాల నివారణకు అనేక చట్టాలు ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంలో జస్టిస్ అమానుల్లా స్పందిస్తూ.. ఆ వాంగ్మూలం చాలా సింపుల్‌గా ఉందని, ఓ విధానం ఎంత వరకు మూఢవిశ్వాసమో చెప్పేందుకు కోర్టుకు హక్కు ఉందని, అది మా పరిధిలోకి వస్తుందన్నారు. ఆ తర్వాత చట్టసభ పరిధిలోకి వెళు తుందన్నారు.చట్టసభల్లో తీర్మానించిన అంశమే చివరిదని చెప్పలేరని, అలా జరగదు అని జస్టిస్ అమానుల్లా అన్నారు. మతపరమైన ఓ ప్రక్రియను మూఢనమ్మకంగా నిర్ణయించే హక్కు కోర్టుకు లేదని తుషార్ మెహతా అన్నారు. ఎందుకంటే ఆ కోర్టులో ఆ మతనిష్ణాతులు ఉండరన్నారు. చట్టం అంశాల్లో న్యాయమూర్తులే నిపుణులు అని, కానీ మతం అంశంలో కాదని ఆయన అన్నారు. నాగాలాండ్‌లో ఉన్న ఓ మతవిధానాన్ని తాను వ్యక్తిగతంగా ఓ మూఢనమ్మకంగా భావిస్తానని, మనమో విభిన్నమైన సమాజంలో ఉన్నామని, మహారాష్ట్రలో క్షుద్ర విద్యకు చెందిన చట్టం ఉందని, అయితే ఆ విద్య అక్కడ ప్రాచుర్యంలో ఉన్నట్లు వాళ్లు చెబుతారని, అందుకే ఆర్టికల్ 25(2)(బీ) ప్రకారం దాన్ని రక్షిస్తున్నట్లు తుషార్ మెహతా తెలిపారు.ఆ టైంలో జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ.. ఒకవేళ మత విధానంలో క్షుద్రవిద్య కూడా భాగమే అయితే, అప్పుడు దాన్ని మూఢనమ్మకంగా భావించవచ్చా అని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ క్షుద్రవిద్యను నియంత్రించే హక్కు చట్టసభలకే ఉందని చెబితే, అప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ప్రజల ఆరోగ్యం , క్షేమం ప్రకారం దాన్ని నిషేధించవచ్చా అని జస్టిస్ బాగ్చీ అడిగారు. దానికి సొలిసిటర్ జనరల్ స్పందిస్తూ.. ఒకవేళ ఆ అంశం .. ఆరోగ్యం, నైతికత, ప్రజా సంక్షేమం పరిధిలోకి వస్తే, అప్పుడు దాన్ని న్యాయ సమీక్ష చేయవచ్చు అని, కానీ కేవలం అది మూఢనమ్మకం అన్న కోణంలో పరిగణించరాదు అన్నారు. ఒక మతంలో ఒక ఆచరణీయ విధానాన్ని ఆ మతతత్వ కోణంలో చూడాలని జస్టిస్ నాగర్నత అన్నారు. ఓ మతానికి చెందిన అభిప్రాయాన్ని, మరొకరికి ఆపాదించరాదు అని, ఆ మతతత్వాన్ని మాత్రమే కోర్టు పరిగణలోకి తీసుకోవాలని జస్టిస్ నాగరత్న తెలిపారు.

## ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందా.. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై మిస్సైల్ దాడులు చేసిందా..?

హైదరాబాద్ : అగ్రరాజ్యం అమెరికా ఇరాన్ దేశాల మధ్య గత రాత్రి కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని ఇజ్రాయెల్ కూడా స్వాగతించింది. అయితే ఈ ఒప్పందం కుదిరిన గంటల వ్యవధిలోనే ఇరాన్ ఉల్లంఘించిందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలైన దుబాయ్, సౌదీ, కువైట్‌పై ఇరాన్ మిస్సైల్ దాడులతో విరుచుకుపడిందనే ప్రచారం జరుగుతోంది. ఇజ్రాయెల్ కూడా ఇరాన్ తమపై మిస్సైల్ దాడులకు పాల్పడిందని ఆరోపించింది.ఇరాన్ గంటల వ్యవధిలోనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఇజ్రాయెల్ ఆరోపించింది. తమ నగరాలపైకి క్షిపణులు



ప్రయోగించిందని, వాటిని మధ్యలోనే తమ బలగాలు అడ్డుకుని కూల్చేశాయని తెలిపింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనతో ఇజ్రాయెల్ సైన్యం హైఅలర్ట్ ప్రకటించింది. గంట వ్యవధిలోనే ఇరాన్ మూడుసార్లు క్షిపణులను ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. ఈ దాడులను ఎదుర్కొనేందుకు తమ రక్షణ వ్యవస్థలు నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపింది.హర్మ్యాజ్ జలసంధిని పూర్తిగా తెరవాలన్న షరతుతో ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై దాడులను ట్రంప్ రెండు వారాలపాటు వాయిదా వేశారు. ఈ ఒప్పంద ప్రకటన వెలువడిన వెంటనే ఇరాన్ దాడులకు దిగిందనే వార్తలు పరిస్థితిని ఆందోళనకరంగా మార్చాయి. శాంతి దిశగా అడుగులు పడుతున్న తరుణంలో ఇరాన్ దాడులకు పాల్పడిందన్న వార్తలు పశ్చిమాసియాలో మళ్లీ పూర్తిస్థాయి యుద్ధ భయాలను సృష్టించాయి. ఇరాన్ వైఖరిపై అమెరికా, ఇజ్రాయెల్ ఎలా స్పందిస్తాయనే దానిపై ఉత్కంఠ నెలకొన్నది.

## 'ఇరాన్ నుంచి వెంటనే బయటపడండి'.. భారత పౌరులకు కేంద్ర తాజా అడ్వయిజరీ




ఇరాన్ దేశంలోని భారతీయులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి కీలక అడ్వైజరీ జారీచేసింది. ఆ దేశం నుంచి వెంటనే బయటపడాలని సూచించింది. ఈ మేరకు ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్ (టీ)' వేదికగా పోస్టును పంచుకుంది. కేంద్ర ప్రభుత్వం సూచనల ఆధారంగా ఇరాన్ నుంచి బయటపడాలని కోరింది.ఇరాన్‌లోని రాయబార కార్యాలయాన్ని సంప్రదించకుండా లేదా వారితో సమన్వయం చేసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావద్దని హెచ్చరించింది. ఈ మేరకు రాయబార కార్యాలయం అత్యవసర సమయంలో సంప్రదించేందుకు ఫోన్ నెంబర్లు ఇచ్చింది. +989128109115, +989128109109, +989128109102, +989932179359, మెయిల్ ఐడి ? ం షేర్ చేసింది.అమెరికా, ఇరాన్ దేశాలు గత రాత్రి రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ క్రమంలో నిన్న కూడా కేంద్రం ఒక అడ్వయిజరీ జారీచేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని, ఇళ్లలోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్థుల భవనాలకు దూరంగా ఉండాలని సూచించింది. ఇప్పుడు కాల్పుల విరమణ నేపథ్యంలో తాజాగా మరో అడ్వైయిజరీ జారీచేసింది. ఇరాన్‌ను వెంటనే వీడాలని తాజా అడ్వయిజరీలో పేర్కొన్నది.

## 'మా ఊరికి పిల్లను ఎవరు ఇవ్వరు, మా పిల్లను పెళ్లి కూడా చేసుకోరు..'



కరీంనగర్ జిల్లా హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన దీక్షా శిబిరం కొనసాగుతున్న విషయం తెలిసిందే. కాగా డంపింగ్ యార్డ్ ఏర్పాటును స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.మా హుజూరాబాద్ ప్రాంతానికి డంపింగ్ యార్డు వస్తే మాకు రోగాలు వస్తాయి, పంటలు పండవని స్థానిక వ్యక్తి ఒకరు అన్నారు. ఈ విషయమై సదరు వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే మా ఊరికి పిల్లను ఎవరు ఇవ్వరు, మా పిల్లను పెళ్లి కూడా చేసుకోరు.. ఎందుకంటే ఈ డంపింగ్ యార్డ్ వాసన వడి పిల్లలు అయ్యే అవకాశాలుండయ్ అన్నారు.మాది విత్తనాలు తయారు చేసే ప్రాంతం.. డంపింగ్ యార్డ్ వస్తే విత్తనాలకు నోచుకోకుండా అవుతుంది. జనావాసాలు లేని పరకాల, భూపాలపల్లి, ములుగు, మేడారం ఏరియాలకు 40-50 కిలోమీటర్ల దూరంలో జంగిల్ ఉన్నది. దగ్గర పెట్టుకోవాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాము. మేం పండిస్తే సిర్పపల్లి గ్రామం నుంచి ప్రతీ ఒక విత్తనం ఆంధ్రాకు పోతది. మేం పండించిన పంటనే సీడ్ అయి వస్తది. డంపింగ్ యార్డ్ రద్దు చేయపోతే ఢిల్లీ వరకైనా పోయి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.హుజూరాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డు పెట్టడం వల్ల చుట్టు పక్కన ఉన్న 20 గ్రామాలు ఆగం అవుతాయని మరో వ్యక్తి చెప్పుకొచ్చారు. పొన్నం ప్రభాకర్, బండి సంజయ్, కలెక్టర్ ఇట్ల అందరికీ వినతి పత్రం ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని.. రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ అయితే నువ్వు చెప్పేదాకా నాకు కూడా తెల్వదు అన్నాడు. మా ప్రజల గోస విని డంపింగ్ యార్డు పెట్టడం విరమించుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

## మాట నిలబెట్టుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

తిమ్మాపూర్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో ఇటీవల జరిగిన సర్పంచుల ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హామిని నిలబెట్టుకున్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులను గెలిపిస్తే ఆ గ్రామాల్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్ ప్రజలకు హామీ ఇచ్చారు.మండలంలోని మొగిలిపాలెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ తిరుపతి గెలవగా ఆ గ్రామంలో వాటర్ కూలింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి బుధవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కేవలం మెయింటెన్స్ ఖర్చులు తీసుకుని కూల్ వాటర్ గ్రామస్తులకు అందుబాటులో ఉంచాలని గ్రామ పాలకవర్గానికి సూచించారు. మిగతా గ్రామాల్లో కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాట్ల తిరుపతి, ఉప సర్పంచ్ మేకల మహేష్, నాయకులు పాశం అశోక్ రెడ్డి, సమ్మయ్య, సతీష్, పరశు రాములు, రవి, శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 28న గూగుల్ డేటా సెంటర్ కు శంకుస్థాపన

విశాఖపట్టణం, ఏప్రిల్ 8, రాష్ట్రంలో ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. విశాఖపట్నం జిల్లాలో ఈ నెల 28వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ తో పాటు గూగుల్ సంస్థకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. అంతర్జాతీయ దిగ్గజ సంస్థ గూగుల్ అమెరికావెలుపల అత్యధిక పెట్టుబడి 15 బిలియన్ డాలర్ల (రూ. 1.35 లక్షల కోట్లకు పైగా) వ్యయంతో చేపడుతున్న మొదటి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ను నిర్మించనున్నారు. 2028 చివరికి డేటా సెంటర్ పనులు పూర్తి చేసి, ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. గూగుల్ డేటా సెంటర్కు మూడు చోట్ల మొత్తం 601.4 ఎకరాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. విశాఖ జిల్లా ఆనందపురం తర్లువాడలో 266.6 ఎకరాలు, విశాఖ గ్రామీణ మండలం అడవివరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఏపీఐఐసీకి చెందిన 174.8 ఎకరాలు కేటాయించారు.గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీన్రా్ణు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారుగూగుల్ సంస్థ ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ల కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ గత ఏడాది అక్టోబర్ 14న ఎంవోయూపై సంతకాలు చేశాయి. అవసరమైన భూమిని ప్రభుత్వం గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కు అప్పగించింది. మూడు డేటా సెంటర్ల ఏర్పాటుతో విశాఖపట్నం ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్గా గుర్తింపు పొందే అవకాశం ఉంది. దీనికోసం 601.40 ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది.విశాఖపట్టణం తీర ప్రాంతం కావడంతో ఇక్కడి నుండి సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు సముద్రగర్భ కేబుల్ వ్యవస్థల ద్వారా నేరుగా అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల విశాఖ నగరం అంతర్జాతీయ డేటా కనెక్టివిటీ ప్రధాన కేంద్రంగా మారనుంది.

## విజయవాడ స్టేడియానికి మహర్దశ

విజయవాడ, ఏప్రిల్ 8,ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అంతర్జాతీయ హంగులు అద్దుకోబోతోంది. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ స్టేడియంను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరుద్ధరించాలని నిర్ణయించింది. విజయవాడ నగరాన్ని ఒక స్పోర్ట్స్ హబ్గా తీర్చిదిద్దే క్రమంలో ఇది మొదటి అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆధునీకరణ పనులకు సంబంధించి ఈ నెల 8వ తేదీన అధికారికంగా శంకుస్థాపన జరగనుంది.రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఈ కార్యక్రమానికి హాజరై పనులను ప్రారంభించనున్నారు. క్రీడాకారుల కోసం అత్యాధునిక వసతులు మరియు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. పునరుద్ధరణలో భాగంగా స్టేడియంలో అత్యాధునిక రన్నింగ్ ట్రాక్స్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఇండోర్, అవుట్ డోర్ కోర్టులు నిర్మించనున్నారు. శిక్షణలో ఉండే క్రీడాకారుల కోసం అధునాతన హాస్టల్ సౌకర్యాలు, జిమ్ మరియు ఇతర సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు ఈ స్టేడియం వేదికగా మారనుంది. ప్రపంచ స్థాయి పోటీలకు సరిపడేలా స్టేడియం సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు స్థానికంగానే అత్యుత్తమ శిక్షణ అందేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బెజవాడ క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ప్రభుత్వం మొత్తం రూ. 53 కోట్లు వెచ్చించనుంది. ఇందులో మొదటి విడతగా రూ. 30 కోట్లతో పనులను ప్రారంభించనున్నారు.2027 నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసి, 2029లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన స్టేడియం మధ్యలో 400 మీటర్ల పొడవైన, 8-లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న శాప్ ప్రధాన కార్యాలయాన్ని తొలగించి, ఆ స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను నిర్మించనున్నారు. టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్బాల్ మరియు కబడ్డీ కోసం అదనంగా కొత్త ఔట్డోర్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు.

## విశాఖ టూ మావిగన్

శ్రీకాకుళం, ఏప్రిల్ 8, రాజధానుల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక స్టాండ్ అంటూ లేకుండా పోతోంది. మొన్నటి వరకు మూడు రాజధానులు అన్న జగన్మోహన్ రెడ్డి మావిగన్ ప్రతిపాదన తీసుకొచ్చారు. మచిలీపట్నం-విజయవాడ- గుంటూరును కలుపుతూ మావిగన్ రాజధాని ఏర్పాటు చేయాలని ప్రత్యామ్నాయం సూచించారు. దాదాపు అమరావతి రాజధానికి దగ్గరగానే ఆయన సూచనలు ఉన్నాయి. కానీ ఇన్ని పరిణామాలు జరిగిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ఈ మాట చెప్పడమే విమర్శలకు తావిస్తోంది. చంద్రబాబు అమరావతి ప్రతిపాదన చేసినప్పుడే ఈ మావిగన్ సూచించి ఉంటే బాగుండేది. పోనీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులు అనేకంటే.. ఈ మావిగన్ ప్రతిపాదన చేసి ఉంటే బాగుండేది. కానీ ఇప్పుడు ఆ ప్రతిపాదన చేస్తుండడం మాత్రం ఇబ్బందికరంగా మారింది. అనవసరంగా ఆయన టార్గెట్ అవుతూ వస్తున్నారు.ఒకవైపు మావిగన్ ప్రతిపాదన చేయగా.. ఇంకోవైపు ధర్మాన లాంటి సీనియర్ నేత వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అన్యాయం గురించి ప్రశ్నిస్తున్నారు. నిన్నటి వరకు ఇదే ధర్మాన మేధావి ఉత్తరాంధ్రకు రాజధాని ప్రకటించడాన్ని హర్షించారు. విశాఖ పాలన రాజధానిని ఆహ్వానించారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో ఊరువాడ ప్రచారం చేశారు. కానీ ఇప్పుడు ఆయన జగన్మోహన్ రెడ్డిని ఏం అనడం లేదు. ఆది నుంచి చంద్రబాబు స్టాండ్ అమరావతి. ఆయన మాట మార్చలేదు. కానీ మూడు రాజధానుల్లో భాగంగా విశాఖను పాలన రాజధాని చేస్తానన్నారు జగన్. దానిని విస్తృతంగా ప్రచారం చేశారు ధర్మాన. 2024 ఎన్నికలకు ముందు ఈ సీనియర్ నేత తన సొంత నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో దీనిపైనే డిబేట్ పెట్టారు. ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు జగన్ మూడు రాజధానుల నుంచి మావిగన్ వైపు వెళ్తే దాని గురించి పట్టించుకోవడం లేదు.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగింది అంటే అది జగన్మోహన్ రెడ్డి చేసినట్టే. జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రలోని విశాఖను పాలనా రాజధానిగా ప్రకటించారు. దానిని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు ధర్మాన. ఇప్పుడు అదే జగన్ విశాఖ కాదు మావిగన్ అంటున్నాడు. కానీ ధర్మాన జగన్మోహన్ రెడ్డిని విడిచిపెట్టి చంద్రబాబును టార్గెట్ చేస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని.. విభజన చట్టమే చెప్పిందని.. 80 ఏళ్ల వయసులో కూడా ఉత్తరాంధ్ర ప్రజలు పొట్ట చేత పట్టుకుని వలస వెళ్తున్నారని.. రాయలసీమ బిడ్డగా ఉండి ఆ ప్రాంత అభివృద్ధికి చంద్రబాబు ఏం చేశారని నిలదీస్తున్నారు ధర్మాన.

# మళ్లీ తెరపైకి గ్రేటర్ రాయలసీమ

కర్నూలు, ఏప్రిల్ 8, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ వాదం తెరపైకి వచ్చింది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగిన టైమ్లోనే రాయలసీమ అస్తిత్వం అంటూ చర్చలు జరిగాయి. ఇప్పుడు గ్రేటర్ రాయలసీమ అంటూ మాజీమంత్రి మైసూరారెడ్డి మరోసారి స్లోగన్ అందుకున్నారు. నవ్యాంధ్రలో ఇప్పుడిప్పుడే రాజధాని వ్యవహారం ఒక కొలిక్కి వచ్చిందని అంతా అనుకుంటున్నారు. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణా విడిపోయాక 2014 నుంచి 12 ఏళ్లుగా ఏపీ రాజధాని అంశం ప్రతి రోజు చర్చకు వస్తోంది.ఇప్పుడు అమరావతి రాజధానిగా పార్లమెంట్ ఉభయసభలు లైన్ క్లియర్ చేసినా..వైసీపీ మాత్రం మావిగన్ స్లోగన్ బలంగా వినిపిస్తోంది. ఏపీ రాజధానిగా అమరావతికి హోదా దక్కిందన్న సంతోషం దక్కిందో లేదో..వైసీపీ క్యాపిటల్ ఫైట్కు తెరలేపింది. సరే అది ఎప్పటికీ ఉండే ముచ్చటే అనుకుంటే..సీనియర్ రాజకీయ నేత మాజీమంత్రి మైసూరారెడ్డి ఒక బాంబు పేల్చారు. ఏపీలో రాజధాని పరిణామాలు, రాజకీయాలు చూస్తుంటే గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం తప్పదని అనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు.ఏపీలో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన సమయంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిషన్ చేసిన సిఫార్సులను గుర్తు చేశారు. అమరావతి ప్రాంతాన్ని కానీ విజయవాడ గుంటూరును కానీ రాజధానిగా ఎంపిక చేయొద్దని శివరామకృష్ణన్ కమిషన్ కీలక సూచనలు చేసిందంటున్నారు. దొనకొండ దగ్గర ఏకంగా 70 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కూడా కమిషన్ చెప్పిందన్నారు. అంతే కాదు రాజధాని నిర్మాణం కోసం వ్యవసాయ భూములను తీసుకోవద్దని ప్రైవేట్ భూములు అంతకంటే తీసుకోవద్దని కమిషన్ చెప్పిందంటున్నారు.కానీ 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పట్టుబట్టి మరీ వ్యవసాయ భూములు, పైగా ముంపు ప్రాంతం అయిన అమరావతిని ఎంపిక చేశారని మైసూరారెడ్డి విమర్శించారు. మావిగన్ పేరుతో జగన్ కొత్త ప్రతిపాదనలు చేయడం మరింత బాధాకరం అన్నారు. నాడు అమరావతికి ఓకే చెప్పి..ఆ తర్వాత మూడు రాజధానుల నినాదాన్ని ముందుకు తెచ్చారన్నారు. ఇప్పుడు మావిగాన్ అంటూ అర్థం పర్దం లేని మాటలు ఎందుకు అంటూ మండిపడ్డారు. శివరామ కృష్ణన్ కమిషన్ వద్దు అన్నచోటే ఈ ఇద్దరు నాయకులు రాజధాని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఈపాటికే గ్రేటర్ రాయలసీమ ఉద్యమాన్ని ప్రారంభించాల్సి ఉందని, వయసు కారణంగా ఆగిపోతున్నానని అంటున్నారు. కానీ రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై యువత స్పందించాలని వారు గ్రేటర్ రాయలసీమ నినాదంతో ఉద్యమించాలని మైసూరారెడ్డి పిలుపు ఇవ్వడం హాట్ టాపిక్గా మారింది.

గ్రేటర్ రాయలసీమ డిమాండ్ కొత్తేమీ కాదు. ఏపీ, తెలంగాణ విభజన సమయంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రాయల తెలంగాణ కావాలని సోనియా గాంధీకి విన్నవించారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలను తెలంగాణతో కలిపితే అది ఒక బలమైన రాజకీయ శక్తిగా మారుతుందని ఆయన కోరారు. ఇక బైరెడ్డి రాజశేఖర్రెడ్డి లాంటి వాళ్లు ప్రత్యేక రాయలసీమ అంటూ దీక్షలు కూడా చేశారు. రాయలసీమ హక్కులు, నీళ్లు, నిధులు అంటూ కొన్నాళ్లు హడావుడి చేసి సైలెంట్ అయిపోయారు. గ్రేటర్ రాయలసీమ అంటూ మైసూరారెడ్డితో పాటు గంగుల ప్రతాప్రెడ్డి వంటి నేతలు గతంలోనే తెరమీదకు తెచ్చారు.ఆంధ్రప్రదేశ్ పర్యాటకంఒకప్పటి రాజధాని కర్నూలుతో పాటు మొత్తం రాయలసీమ ప్రాంతానికి ఇప్పటికీ అన్యాయం జరుగుతుందని చెబుతున్న నేతలు..కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు దక్షిణ కోస్తా జిల్లాలైన నెల్లూరు, ఒంగోలు జిల్లాలను కలిపి గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం చేయాలన్నది వీరి ప్రధాన డిమాండ్. 2014లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కూడా కొందరు సీమకు అన్యాయం జరుగుతోందని ఆందోళనలు చేపట్టారు. కానీ, 2019 నుంచి 2024 వరకు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఈ గళం పూర్తిగా మూగబోయింది. ఆ సమయంలో రాయలసీమ గురించి ఏ ఒక్కరూ నోరు మెదపలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా..ఓ వైపు అమరావతికి చట్టబద్ధత దక్కిన వేళ..గ్రేటర్ రాయలసీమ నినాదాన్ని పొలిటికల్ స్క్రీన్పైకి తేవడం ఆసక్తికరంగా మారింది.

# కూటమి ధీమా వెనుక కథేంటి

ఒంగోలు, ఏప్రిల్ 8,ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉంది. కానీ రాబోయే ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ జరుగుతోంది. కూటమి లాంగ్ లీవ్ అంటున్న చంద్రబాబు, పవన్.. వైసీపీ మళ్లీ రాదు గాక రాదు అని తెగేసి చెప్తున్నారు. వచ్చే టర్మే కాదు..రాబోయే 30ఏళ్ల వరకు కూడా వైసీపీకి అవకాశమే ఇవ్వము అన్నట్లుగా చెప్పుకొస్తున్నారు. థర్టీ ఇయర్స్ స్థిరమైన నాయకత్వం ఉండేలా ప్లాన్ చేస్తున్నామని అంటున్నారు సీఎ చంద్రబాబు.ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, అసహనం కలిసి వస్తాయని వైసీపీ దింపుడు కళ్లం ఆశ పెట్టుకుని కూర్చుందని..అది జరగదని క్లియర్ కట్గా చెప్పేస్తున్నారు టీడీపీ అధినేత. గత ఎన్నికల కంటే కూటమి..ఎస్పెషల్గా టీడీపీ మెరుగైన స్థానంలో ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు చేసిన ఈ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోందివైసీపీ మళ్లీ అధికారంలోకి రాదు. ఎలా పవర్లోకి వస్తారో చూస్తానంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రిపీటెడ్గా కామెంట్స్ చేస్తున్నారు. ఓ రకంగా వైసీపీకి ఛాలెంజ్ కూడా చేస్తున్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు కూడా సుత్తి లేకుండా సూటిగా చెప్పేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందన్న ఆశలు వద్దు. మీకు ఆ ఛాన్స్ ఇవ్వం. అంత సీన్ కూడా లేదంటున్నారు.రాబోయే 30 ఏళ్ల పాటు స్థిరమైన నాయకత్వం ఉండేలా మాస్టర్ స్కెచ్ వేస్తున్నామని..అలా అయితే ఏపీ డెవలప్మెంట్ అన్స్టాపబుల్ అన్నట్లుగా పరుగులు పెడుతుందని చెప్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి కోలుకోవడానికే సమయం పడుతుందని..అలాంటిది ఏపీ మిగతా రాష్ట్రాలతో పోటీ పడేలా..దేశంలో అగ్రగామిగా నిలబడాలంటే..బలమైన, స్థిరమైన నాయకత్వం అవసరమని అంటున్నారుఅయితే ప్రభుత్వ వ్యతిరేకత మీదే వైసీపీ హోప్స్ పెట్టుకుందని ..కానీ అలా జరగనివ్వబోమని చెప్పడం ఇంట్రెస్టింగ్గా మారింది. బాబు ఇంత ఔట్ రైట్గా ఓ కామెంట్ చేయడం అంటే ఆశామాషీ కాదు. ఆయన థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా పొలిటిక్స్లో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన నాయకుడు. అలాంటి చంద్రబాబు తమ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రాదు..రానివ్వమంటూ ధీమా వ్యక్తం చేయడం..ఇండైరెక్ట్గా ఫ్యాన్ పార్టీని ఛాలెంజ్ చేయడం పొలిటికల్ హాట్ టాపిక్గా మారిందఇంతకు బాబు ధైర్యం వెనుకున్న రహస్యం ఏంటన్నదే డిబేట్ పాయింట్ అవుతుంది. అధికారంలో ఉండి..పైగా ఇంకో మూడేళ్ల పాలన మిగిలి ఉండగానే..వైసీపీ ఎత్తులను పసిగట్టడం ఒక ఎత్తు అయితే..వైసీపీ పెట్టుకున్న ఆశలు అడిఆశలు అవుతాయని చెప్పడం మరో ఎత్తు. అయితే బాబు ఇంత కాన్ఫిడెంట్గా ఉండటానికి రీజనేంటి అన్నదే చర్చకు దారితీస్తోంది. నిజానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బాబు..చాలా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కడా ప్రజా వ్యతిరేకత రాకుండా..ప్రతీ విషయంలో కేర్ తీసుకుంటున్నారు. ఎమ్మెల్యేల పనితీరు అయినా..అభివృద్ధి విషయంలో అయినా..సంక్షేమ పథకాలు అమలులో అయినా..రాజకీయ విమర్శల్లో కూడా ఎక్కడా చిన్న మిస్టేక్ జరగకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు.ప్రజా వ్యతిరేకత రాకుండా ప్లాన్ చేసుకోవడం ఒక ఎత్తు అయితే..ఎప్పటికప్పుడు ప్రజలు కూటమి ప్రభుత్వం గురించి ఏమనుకుంటున్నారు? ఏ విషయంలో అసంతృప్తిగా ఉన్నారని పబ్లిక్ పల్స్ తెలుసుకుంటున్నారు. పైగా సంక్షేమ పథకాల విషయంలో ఇచ్చిన మాట ప్రకారం ఒకదాని తర్వాత మరో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నారు.ఇప్పటికే కీలక పథకాలన్నింటిని గ్రౌండ్ చేశారు. మిగిలిన చిన్న చితక హామీలేమైనా ఉంటే ఎన్నికల నాటికి అవి కూడా ఇంప్లిమెంట్ చేసే ఆలోచనలో ఉన్నారట. ఈ అన్ని విషయాలపై బేరీజు వేసుకుని..క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నాకే చంద్రబాబు భరోసా పెరిగిందన్న టాక్ వినిపిస్తోంది. ఏదైనా వైసీపీని టార్గెట్ చేస్తూ టీడీపీ అధినేత చేసిన వ్యాఖ్యలు అయితే ఏపీ పొలిటిక్స్లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్కు దారితీశాయి.

## ఎందుకు జూన్ 2024 తీసుకున్నారు...

విజయవాడ ఏప్రిల్ 8, ఏపీప్రజల ఆకాంక్ష నెరవేరింది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించింది. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం 2014 సవరిస్తూ తీసుకొచ్చిన బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయగా.. న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2024 జూన్ రెండు నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. అమరావతి గెజిట్ నోటిఫికేషన్ లో 2024 జూన్ రెండు నుంచి రాజధానిగా గుర్తించినట్టు పేర్కొనడంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అదే తేదీ నుంచి ఎందుకు అని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.2014లో రాష్ట్ర విభజన జరిగింది. ఉమ్మడి ఏపీకి హైదరాబాద్ రాజధానిగా ఉండేది.

అయితే విభజన తర్వాత కూడా అంటే 2014 నుంచి 2024 వరకు పదేళ్లపాటు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ను ఉంచారు. అయితే ఆ గడువు 2024 జూన్ 2 తో ముగిసింది. ఈ క్రమంలోనే 2024 జూన్ రెండు నుంచి అమరావతి ఏకైక రాజధానిగా పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది.అయితే ఈ నిర్ణయం వెనుక రెండు కారణాలు ఉన్నాయి. ఉమ్మడి రాజధానిగా హైదరాబాదుకు ఇచ్చిన గడువు ముగియడం ఒకటి అయితే.. మూడు రాజధానుల ఎపిసోడ్ కు చెక్ పెడుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అయింది. రాబోయే రోజుల్లో ఎలాంటి వివాదాలు లేకుండా చట్ట సవరణపై స్పష్టత ఇచ్చారు. ఒకవేళ భవిష్యత్తులో రాజధాని అమరావతి ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలంటే పార్లమెంటుకు మాత్రమే అధికారం కట్టబెట్టారు. శాసనసభలో సవరణ చేసి మార్పు చేస్తామంటే కుదిరే పని కాదు.అయితే అంతా మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే అమరావతికి చట్టబద్ధత కల్పించారని భావించారు. కానీ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కు ఉన్న గడువు ముగిడంతోనే ఈ కీలక నిర్ణయం తీసుకున్నారన్న విషయం చాలామందికి తెలియదు. ఎంతవరకు మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే.. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనుకున్నారు. కానీ 2024 జూన్ 2 తో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగిసిందని కేవలం కొద్ది మందికి మాత్రమే తెలుసు

## అంతర్జాతీయ హోటల్ గా రుషికొండ

విశాఖపట్టణం ఏప్రిల్ 8, రుషికొండ భవనాల అదృష్టం త్వరలో మారబోతోంది. ఈ ప్యాలెస్ను ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశంపై కేబినెట్ సబ్ కమిటీ కసరత్తును ముగించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఈ భవనాలను ప్రజాధనానికి భారంగా కాకుండా, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే వనరుగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 10న జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకుని, అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.గతంలో రుషికొండపై ఉన్న హరిత రిసార్ట్స్ ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి సుమారు 7 కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది. కానీ ప్రస్తుతం నిర్మించిన ప్యాలెస్ నిర్వహణకే నెలకు 25 లక్షల రూపాయల వరకు ఖర్చవుతోంది. విద్యుత్ ఛార్జీలు, ఇతర నిర్వహణ ఖర్చులు కలిపి ఏడాదికి 3 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చవుతుండటంతో, ప్రభుత్వం దీనిని ప్రోపర్ యుటిలైజేషన్ చేయాలని నిర్ణయించింది. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, సుమారు 1517 మంది నుంచి సేకరించిన సూచనల ఆధారంగా ప్రభుత్వం ఒక ప్రణాళికను రూపొందించింది. రుషికొండ ప్యాలెస్ నిర్వహణకు ప్రపంచస్థాయి గుర్తింపు ఉన్న ×తాజ్ గ్రూప్, ఎట్మాస్ఫియర్ కోర్, లీలా, ఫెమా వంటి నాలుగు ప్రముఖ సంస్థలు ఆసక్తి కనబరిచాయి. ఈ భవనాలను ఒక విలాసవంతమైన హోటల్ లేదా రిసార్ట్గా మార్చడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ నాలుగు గ్రూపుల్లో ఒకదానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించి, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్యాలెస్ను కమర్షియల్ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నప్పటికీ, సామాన్య ప్రజలు కూడా ఆ భవనాలను సందర్శించేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. ఇది కేవలం ఒక రహస్య బంగ్లాగా మిగిలిపోకుండా, విశాఖ పర్యాటకంలో ఒక భాగంగా మార్చాలని కేబినెట్ సబ్ కమిటీ ప్రతిపాదించింది. ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు, ప్రజలకు కూడా దీని వల్ల ప్రయోజనం ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈనెల 10న కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే ఈ విలాసవంతమైన భవనాల కొత్త రూపం ఖరారు కానుంది.

## టిప్పు సూల్తాన్ సర్కిల్ వివాదం,.. మళ్లీ మొదటికి

కడప, ఏప్రిల్ 8, రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడప నగరంలో టిప్పు సుల్తాన్ పేరుతో ఒక సర్కిల్ను ఏర్పాటు చేయాలని జరుగుతున్న ప్రయత్నాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తున్నాయి. భారత చరిత్రలో అత్యంత వివాదాస్పద వ్యక్తిగా ముద్రపడిన టిప్పు సుల్తాన్ పేరును ప్రజా ప్రదేశాలకు పెట్టడం సరికాదని పలు హిందూ సంఘాలు , భారతీయ జనతా పార్టీ గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్లో ఇటువంటి చర్యలు మతపరమైన విభేదాలను సృష్టించే కుట్రలో భాగమని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. టిప్పు సుల్తాన్ తన పాలనలో హిందూ సమాజంపై దాడులు చేశారని, దేవాలయాలను ధ్వంసం చేయడమే కాకుండా వేలాది మందిని బలవంతంగా మతమార్పిడి చేశారని బిజెపి నాయకులు గుర్తు చేస్తున్నారు. అటువంటి వ్యక్తిని గొప్పగా చిత్రీకరించడం భావ్యం కాదని, ఇది స్థానిక ప్రజల సెంటిమెంట్లను గాయపరచడమేనని వారు వాదిస్తున్నారు. గతంలో ఇదే జిల్లాలోని ప్రొద్దుటూరులో కూడా ఇటువంటి ప్రయత్నం జరిగినప్పుడు, హిందూ సమాజం తిరుగుబాటుతో అది ఆగిపోయిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇటువంటి సున్నితమైన అంశాల్లో కఠినంగా వ్యవహరించాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను అడ్డుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. కావాలనే సమాజంలో చీలిక తెచ్చేందుకు కొందరు ఇటువంటి ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి శాంతిభద్రతలను కాపాడాలని బాధితులు , సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. ఈ వివాదంతో, కడప మున్సిపల్ కమిషనర్ , జిల్లా కలెక్టర్ ఈ ప్రతిపాదనకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదని బిజెపి డిమాండ్ చేస్తోందది. స్థానిక ప్రజల మనోభావాలను గౌరవించాలని కోరుతోంది. టిప్పు సుల్తాన్ మద్దతుదారులు ఆయనను బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకగా పోరాడిన మొట్టమొదటి పాలకుల్లో ఒకరిగా చూస్తారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించిన మైసూరు పులి గా, దేశభక్తుడిగా ఆయనను గౌరవిస్తూ, ఆ జ్ఞాపకార్థం సర్కిల్కు ఆయన పేరు పెట్టాలని కోరుతుంటారు. కడప , ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ముస్లిం జనాభా గణనీయంగా ఉంది. తమ సామాజిక వర్గానికి చెందిన ఒక చారిత్రక వీరుడి పేరును ఒక సర్కిల్కు పెట్టాలనేది ఆయా ప్రాంతాల్లోని ముస్లిం పెద్దలు మరియు నాయకుల దశాబ్దాల కాలం నాటి కోరిక. దీనిని మత సామరస్యానికి మరియు తమ గుర్తింపుకు చిహ్నంగా వారు భావిస్తారు. చారిత్రక ఆధారాల ప్రకారం టిప్పు సుల్తాన్ కుటుంబానికి కడపతో సంబంధం ఉంది.

## మిడుతూరు తహసీల్దార్ కార్యాలయంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 08:-మిడుతూరు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించి, పారదర్శకంగా మరియు వేగవంతంగా సేవలు అందించాలని అధికారులకు ఆదేశించారు.రీ-సర్వే పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని సూచించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను సమయానికి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.అలాగే గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించి, పంచాయతీరాజ్ శాఖ ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## ర్యాంకోపై రైతుల ఆందోళనకు మద్దతు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 08-కొలిమిగుండ్ల మండలంలోని కలవటాల వద్ద ర్యాంకో సిమెంట్ ఫ్యాక్టరీ కాలుష్యంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న శాంతియుత ఆందోళనపై పోలీసుల వైఖరి మారాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు పేర్కొన్నారు. రైతుల ఆందోళనకు 30 ఆక్ట్ అమలు చేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు.ఫ్యాక్టరీ కారణంగా 18 గ్రామాల రైతులు భూములు కోల్పోయారని, ఇచ్చిన ఉద్యోగ హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని తెలిపారు. కాలుష్యంతో పండ్ల తోటలు దిగుబడి లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సమస్యల పరిష్కారానికి చర్చలు ఫలించకపోవడంతో శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తామని, ఎన్ని అడ్డంకులు వచ్చినా రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## స్పాట్ వాల్యుయేషన్‌ను పరిశీలించిన కలెక్టర్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఏప్రిల్ 08:నంద్యాల శివారు ఎస్‌డీఆర్ పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి స్పాట్ వాల్యుయేషన్‌ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం పరిశీలించారు. వాల్యుయేషన్ కేంద్రంలోని ఏర్పాట్లు, పనితీరును ఆమె సమీక్షించి అధికారులకు సూచనలు ఇచ్చారు.జిల్లాకు 1,86,489 సమాధాన పత్రాలు వచ్చాయని, ఈ నెల 6 నుంచి 15 వరకు మూల్యాంకనం కొనసాగుతుందని డీఈఓ జనార్దన్ రెడ్డి తెలిపారు. మొత్తం 76 చీఫ్ ఎగ్జామినర్లు, 440 అసిస్టెంట్ ఎగ్జామినర్లు పాల్గొంటున్నారని వివరించారు.సమాధాన పత్రాల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత జాగ్రత్తగా మార్కులు కేటాయించాలని సూచించారు.



## బీజేపీతో భూమా రాజశేఖర్ రెడ్డికి సంబంధం లేదు--

### నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మదు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 08-నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన భూమా రాజశేఖర్ రెడ్డి అనే వ్యక్తి ఇటీవల పార్టీ నాయకుడిపై బెదిరింపు ధోరణితో తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం పట్ల భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకత్వం తీవ్రంగా స్పందించింది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మదు మాట్లాడుతూ, భూమా రాజశేఖర్ రెడ్డి గారు గతంలో కూడా పార్టీలో ఎటువంటి బాధ్యత లేకపోయినా, పార్టీ సమావేశాల్లో అనధికారికంగా పాల్గొని పార్టీ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తూ అనుచితంగా ప్రవర్తించిన ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ విషయాలను ఇప్పటికే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.పార్టీ క్రమశిక్షణను పదేపదే ఉల్లంఘిస్తూ, నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అసహనీయమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయని అన్నారు.కావున భూమా రాజశేఖర్ రెడ్డి గారికి నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీలో ఎటువంటి బాధ్యత లేదని, ఆయన వ్యక్తిగతంగా చేసే వ్యాఖ్యలు లేదా చర్యలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని మీడియా ముఖంగా స్పష్టం చేస్తున్నామని అభిరుచి మదు తెలిపారు.పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై భవిష్యత్తులో మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నీళ్ళో రామచంద్రఆలూరు నియోజకవర్గలో తీరని త్రాగునీటి కష్టాలు..

ఆలూరు నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య రోజురోజుకీ తీవ్రమవుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా? ప్రజల దాహం మాత్రం తీరడం లేదు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యకు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం దొరకకపోవడం స్థానికులను ఆవేదనకు గురిచేస్తోంది.ప్రస్తుతం ఆలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో 25 రోజులకుపైగా త్రాగునీటి సరఫరా నిలిచిపోయిందని ప్రజలు చెబుతున్నారు. ఇళ్లకు నీరు రాకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ అవసరాలకు సరిపడా నీరు లేకపోవడంతో గుక్కెడు నీటి కోసం జనాలు అల్లాడిపోతున్నారు.నీళ్లు వచ్చే అవకాశం ఉన్నప్పుడల్లా ప్రజలు ముందస్తుగా సిద్ధమై, సింటెక్స్ ట్యాంకులు, ప్లాస్టిక్ డ్రమ్‌లు, గిన్నెల్లో నీటిని నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే నిల్వ చేసిన నీళ్లు కొద్ది రోజుల్లోనే మలినమవుతూ, పురుగులు పడుతున్నా? మరో మార్గం లేక అదే నీటిని వినియోగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇది ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఇక త్రాగునీటి కొరతతో పట్టణంలో వాటర్ క్యాన్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. రూ.15 చొప్పున క్యాన్ నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఆర్థికంగా బలహీన వర్గాలపై ఇది అదనపు భారంగా మారింది. ఒకవైపు ప్రజలు నీటి కోసం కష్టాలు పడుతుంటే? మరోవైపు మినరల్ వాటర్ ప్లాంట్లు మాత్రం ఈ పరిస్థితిని లాభాల అవకాశంగా మార్చుకుంటున్నాయి.ఇంత పెద్ద సమస్య నెలకొన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటి సరఫరా ఎందుకు నిలిచిపోయిందో తెలుసుకునేందుకు కూడా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని అంటున్నారు.

# 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యం సాకారానికి అధికారులు కృషి చేయాలి

### 20 పాయింట్ ప్రోగ్రామ్ ఛైర్మన్ లంకా దినకర్




కర్నూలు, ఏప్రిల్ 08: 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యం సాకారానికి అధికారులు కృషి చేయాలని 20 పాయింట్ ప్రోగ్రామ్ ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో కర్నూలు జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలుపై 20 పాయింట్ ప్రోగ్రామ్ ఛైర్మన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 20 పాయింట్ ప్రోగ్రామ్ ఛైర్మన్ మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత భారత్' గా తీర్చిదిద్దడం ప్రధాని లక్ష్యం అన్నారు. అలాగే 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర గా రూపొందించి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చి దిద్దాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యం అన్నారు. వికసిత భారత్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు.. ఆ దిశగా అన్ని శాఖల అధికారులు పని చేయాలని ఛైర్మన్ ఆదేశించారు.గత కర్నూలు జిల్లా సమీక్షా సమావేశంలో లేవనెత్తిన ఒక అత్యంత కీలకమైన అంశం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పరిపాలనలో మార్పుకు దారితీసిందన్నారు. 2019 నుండి 2024 మధ్య కాలంలో మున్సిపల్ కార్పొరేషన్ నిధులను అఈఓూ నుండి మళ్లించకుండా మున్సిపల్ కార్పొరేషన్లే నేరుగా ఆ నిధులే వినియోగించుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం వల్ల అన్ని జిల్లాలోనీ మున్సిపాల్టీల్లో ఇబ్బందికర పరిస్థితులు పోయాయన్నారు. కోడుమూరు లో చేనేత కార్మికుల నుండి వచ్చిన ఉఎ ట్యాగ్ డిమాండ్ తీర్చేందుకు ప్రభుత్వానికి ఒక లేఖ రాసి, త్వరగా పూర్తి చేయమని కోరడం జరిగిందన్నారు. అలాగే మాస్టర్ వీవర్స్ కు సరిపడా పెట్టుబడి అందడం లేదని, అందుకోసం ాఊఉ మోడల్ లో 20 మంది చొప్పున ఒక గ్రూప్ గా చేసి, రుణాలు, ఆర్థిక సాయం అందిస్తే వారి జీవితాలు మారే అవకాశం ఉందన్నారు. చేనేత కార్మికులు నిరంతరం పని చేయడం వల్ల వారి కంటి చూపు త్వరగా దెబ్బతినే అవకాశం ఉండడంతో పాటు, పనిలో ఉపయోగించే రసాయనాల వల్ల ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. రోజుకు 8 నుండి 9 గంటల పాటు ఒకే చోట కూర్చుని మగ్గంపై పని చేయడం వల్ల ఎముకలు మరియు కీళ్లకు సంబంధించిన (ఆర్థోపెడిక్) సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 'ఎన్టీఆర్ వైద్య సేవ' ద్వారా వీరికి ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. అయితే, సమస్య వచ్చిన తర్వాత చికిత్స అందించడం కంటే, ముందుగానే గుర్తించే 'నివారణ చర్యలు' చేపట్టడం ముఖ్యం అన్నారు. చిన్న పిల్లలకు పాఠశాలల్లో స్క్రీనింగ్ టెస్టులు చేసినట్లుగానే, చేనేత కార్మికులకు కూడా ప్రతి 3 లేదా 6 నెలలకు ఒకసారి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అర్థం చేసుకుని పరిష్కరించాలన్నారు. 2019-24 మధ్య కాలంలో జల్ జీవన్ మిషన్ అమలులో తీవ్ర లోపాలు ఉన్నాయని ఛైర్మన్ తెలిపారు..ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 97 లక్షల గ్రామీణ గృహాలు ఉన్నాయని, ఆగస్టు 15, 2019 నాటికి దేశవ్యాప్తంగా సగటున 17% కంటే తక్కువ (16.75%) కనెక్షన్లు ఉంటే, ఆంధ్రప్రదేశ్ 32% తో మెరుగైన స్థితిలో ఉండేదన్నారు. డిసెంబర్ 2022 నాటికి దేశ సగటు 65% నుండి 70% కు పెరిగినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ కేవలం 35% కు మాత్రమే చేరుకుందని, మూడేళ్లలో కేవలం 3% వృద్ధి చెందిందన్నారు. డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదట జల జీవన్ మిషన్‌పై దృష్టి సారించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నీటి వనరులు, పైపులైన్ కనెక్షన్ల పరిస్థితిని మ్యాపింగ్ చేయించారన్నారు. గత ప్రభుత్వం కేవలం 27,000 కోట్లు కేటాయించగా, క్షేత్రస్థాయిలో శాశ్వత పరిష్కారం కోసం దాదాపు 81,000 కోట్లు అవసరమని గుర్తించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన నివేదికల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం స్పందించి, దేశవ్యాప్తంగా జల జీవన్ మిషన్ బడ్జెట్‌ను 3,75,000 కోట్ల నుండి 8,60,000 కోట్లకు పెంచిందన్నారు. ఈ నిర్ణయం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన మంచినీటిని అందించే లక్ష్యం నెరవేరుతుందన్నారు.వి.బి.జీ రామ్ జీపథకంలో గతంలో ఉన్న ఉపాధి హామీ పథకం కంటే మరిన్ని అంశాలను జోడించారన్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఉపాధి హామీ కోసం 86,000 కోట్లు కేటాయించగా, ఈసారి ఆ మొత్తాన్ని 12% పెంచి ?96,000 కోట్లకు పెంచిందన్నారు. గతంలో జరిగిన మెజర్మెంట్ లోపాలను అరికట్టడానికి ఇప్పుడు ప జియో-ట్యాగింగ్ మరియు ఆన్‌లైన్ ట్రాకింగ్ వంటి సాంకేతికతను ఉపయోగిస్తున్నారని, దీనివల్ల నిధుల దుర్వినియోగం తగ్గుతుందన్నారు. కొత్త సంస్కరణల ప్రకారం, పని దినాలను 100 నుండి 125 రోజులకు పెంచడం మరియు అందులో 60 రోజులను వ్యవసాయ పనులకు కేటాయించడం ద్వారా రైతులకు మరియు కూలీలకు మేలు జరుగుతుందన్నారు. గతంతో పోలిస్తే బడ్జెట్ కేటాయింపులను 10,000 కోట్లు పెంచారన్నారు.

## కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

### రాజ్ విహార్ సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు

### - ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరు-

### ఎక్కువ మంది బాధితులు రోడ్డు ప్రమాదంవారే డా. సుమంత్

కర్నూలు, ఏప్రిల్ 08, 2026: రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. కిమ్స్ హాస్పిటల్స్, కర్నూలు న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ న్యూరోసర్జన్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ రాజ్ విహార్ సర్కిల్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ప్రజలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వేగం నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం వంటి అంశాలు అత్యంత కీలకమని చెప్పారు. రోడ్డు మీద బాధ్యతాయుతంగా నడుచుకుంటేనే ప్రమాదాలను తగ్గించవచ్చున్నారు. కిమ్స్ హాస్పిటల్స్ న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ హెల్మెట్ ధరించడం ప్రాణాలను కాపాడే ముఖ్యమైన అలవాటు అని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వారు మాత్రమే కాకుండా వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు.అనంతరం న్యూరోసర్జన్ డా. సుమంత్ కుమార్ మాట్లాడుతూ, న్యూరోసర్జరీల కోసం ఎక్కువ మంది బాధితులు రోడ్డు ప్రమాదాలు జరిగిన వారే ఎక్కువగా ఉంటారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు గాయాలు అవుతాయని, తలకు గట్టి దెబ్బ తగిలితే మెదడు, వెన్నెముకపై తీవ్ర ప్రభావం పడుతుందని, కొన్ని సందర్భాల్లో శాశ్వత వికలాంగత లేదా ఆకస్మిక మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వ్యక్తిని సురక్షితంగా సమీప ఆసుపత్రికి తరలించడం, అవసరమైతే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడం వంటి ప్రాథమిక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ కర్నూలు ఏవీపీ డా. ఆదిత్య, న్యూరో సర్జరీ విభాగం డాక్టర్లు, మార్కెటింగ్ జీఎం ఆనంద్, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహిస్తామని కిమ్స్ ప్రతినిధులు తెలిపారు.

## నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలి.

### ఆహార పదార్థాల్లో నాణ్యత, శుభ్రత పాటించాలి.

### పారదర్శకంగా దుకాణాలు కేటాయింపు.

### కమిషనర్ ఎన్.మౌర్య.

తిరుపతి,ఈట్ స్ట్రీట్ లో దుకాణాలు పొందిన వారు ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి వ్యాపారాలు నిర్వహించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య దుకాణదారులకు సూచించారు. భారత ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్ లోని 14దుకాణాలకు బుధవారం కచ్చపి ఆడిటోరియంలో లక్కీ డ్రా నిర్వహించారు. కమిషనర్ ఎన్.మౌర్య స్వయంగా పాల్గొని లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన 14దుకాణాలకు పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించామని తెలిపారు. ఇందులో 13దుకాణాలు లాటరీ ద్వారా అభ్యర్థులకు కేటాయించగా, 10వ నెంబర్ దుకాణం ఐ స్టోన్ కంపెనీకి నేరుగా కేటాయించామని తెలిపారు. దుకాణదారులు ఖచ్చితంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి సూచనల మేరకు ఆహార పదార్థాలు వినియోగించాలని తెలిపారు. దుకాణ దారులు నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని తెలిపారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వినియోగించరాదని, అధిక ధరలకు విక్రయించరాదని తెలిపారు. ఆరోగ్యంతో ఉన్న వారి చేతనే ఆహారం వండించడం, వడ్డించేలా చూడాలని తెలిపారు. ఆహార పదార్థాలతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్త బుట్టలను వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార నాణ్యత ప్రమాణాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులచే ప్రెసెంటేషన్ ఇచ్చారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**